RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 126 | ఏప్రిల్ 10, 2025 | వెల : రూ.3-00



వరుసగా వ్యవసాయ మోటార్లు చోరీ..!

4లో..

## నాడు నరికివేత.. నేడు ప్రేలాపన!

- హెచ్‌సీయూ ఇష్యూపై 'గులాబీ' తీరుపై మిశ్రమ స్పందన
- పదేండ్లలో వేల ఎకరాల్లో అడవి విధ్వంసం చేసిన బీఆర్ఎస్
- 400 ఎకరాలపై ఆవేదన చెందుతుందంటూ కాంగ్రెస్ ఆగ్రహం
- లెక్కలతో సహా ప్రతిపక్షానికి అధికార పార్టీ కౌంటర్

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణలో హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చెట్ల తొలగింపు వ్యవహారం సంచలనంగా మారిన నేపథ్యంలో.. అధికార విపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. పర్యావరణ విపత్తును కాంగ్రెస్ సర్కార్ సృష్టిస్తోంది అంటూ మండిపడుతోంది బీఆర్ఎస్. అయితే ఈ విమర్శలపై కాంగ్రెస్ సోషల్ మీడియా గట్టిగా రియాక్ట్ అవుతోంది. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పేరుతో అడవులను నరికారని మండిపడుతోంది.

తెలంగాణలో ఏడేండ్ల పాటు పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమం హరిత హారం.. 2015 నుండి 2022 వరకు, 219 కోట్ల మొక్కలను హరిత హారంలో భాగంగా నాటారు. ఇందుకోసం అయిన ఖర్చు రూ.9,777 కోట్లు. వీటికి రెండు కీలక శాఖల నుంచి కేటాయింపులు జరిగాయి. గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి 5,006.82 కోట్లు కేటాయించగా.. అటవీ శాఖ నుంచి 2,567.12 కోట్లు కేటాయింపులు చేశారు. వాటిల్లో 85శాతం బతికాయని కేసీఆర్ అప్పట్లో స్వయంగా సీఎం హోదాలో కేసీఆర్ ప్రకటన చేసారు. అది నిజం కాదు అనేది కాంగ్రెస్ మాట. తెలంగాణ అటవీ విస్తీర్ణం 2014 నాటికి 21,591 చ.కి.మీ కాగా.. 2021 నాటికి 21,213 చ.కి.మీకి తగ్గింది అనేది కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణ.

ఇక 2014, 2024 మధ్య, బీఆర్ఎస్ పాలనలో 11,422.47 హెక్టార్ల అటవీ భూమి అధికారికంగా.. అటవీయేతర ప్రయోజనాల కోసం కేటాయించారు. అటవీ సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించి 2016 నుంచి 2019 మధ్య కాలంలోనే 12,12,753 చెట్లను నరికారు అని కాంగ్రెస్ అప్పటి పత్రికా కథనాలతో ఆరోపణలు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేయగా.. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారింది. ఇందుకోసం గానూ.. 8,000 ఎకరాల్లో అడవిని నరికారు. మరి అప్పుడు మాట్లాడని బీఆర్ఎస్..ఇప్పుడు ఎందుకు హడావుడి చేస్తోందని కాంగ్రెస్ మండిపడుతోంది.





## గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని

# అడ్డుకోవాలి

- గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి
- దేశంలో బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకరం
- బీజేపీని ఓడించే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది
- అహ్మదాబాద్‌లో ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, డెస్క్:**

వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యం ఇచ్చారని, సోనియా గాంధీ తమకు తెలంగాణ అందించించారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ నాయకత్వంలో తాము బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వమని, బీజేపీని అడ్డుకుంటామని తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసగిస్తూ బీజేపీ తీరుపై పలు విమర్శలు చేశారు. తెలంగాణలో రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకొని వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో తాము బీజేపీకి అవకాశం ఇవ్వమని, వల్లభాయ్ పటేల్ పుట్టిన గుజరాత్ గడ్డపై నుంచి తాను చెబుతున్నానని తెలిపారు. తాము నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో తమకు స్వాతంత్ర్యం వచ్చిందని, అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో తెలంగాణ ప్రజలకు అనుబంధం ఉందని వెల్లడించారు. భారత దేశంలో బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులని ఆరోపించారు. నాడు బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్ధపడాలని సూచించారు. మోదీ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా సమావేశమయ్యామని, గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. గాడ్సే ఆలోచన విధానాన్ని వ్యాపింపజేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని అడ్డుకోవాలని అన్నారు. మోదీ మణిపూర్‌లో మంటలు రాజేసి దేశ నలు మూలల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రాహుల్ గాంధీ సూచించిన విధంగా తాము తెలంగాణలో కుల గణన చేసి చూపించామని, దీనిపై ఆయన లోక్‌సభలో మాట్లాడాతారనే భయంతో ఆయనకు మోదీ మైక్ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదలు, బలహీన వర్గాల అభివృద్ధికి రాహుల్ గాంధీ చూపిన బాటలోనే తాము నడుస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.



## అనుమానమే పెనుభూతమై..

### భార్యను హతమార్చిన భర్త..!

**వేదన్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం అడవిదేవులపల్లి మండలం పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే స్థానికులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పూజల బాల సైదులుతో నరసకుమారికి 12 సంవత్సరాల క్రితం 2012 లో ప్రేమ వివాహం జరిగింది. కొన్ని వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఈ మధ్యకాలంలో భార్యపై అనుమానమే పెనుభూతమై తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. సైదులు తన గ్రామం నుంచి మండల కేంద్రమైన అడవిదేవులపల్లి వెళ్లి పానీపూరి వ్యాపారం చేసేవాడు. ఇదే అదనుగా కుమారి అదే గ్రామానికి చెందిన వేరొక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంటుందని అనుమానంతో భార్యాభర్తల మధ్య పంచాయతీలు జరుగుతుండేవి. ఇదే అనుమానంతో భర్త సైదులు మంగళవారం రాత్రి మద్యం సేవించి వచ్చి నిద్రమత్తులో ఉన్న భార్యపై చికెన్ కొట్టే కత్తితో తలపై పలుమార్లు దాడి చేసి గొంతు నులిమి చంపివేశాడు. హత్య చేసిన సైదులు భయంతో

మిగతా 4వ పేజీలో..

## ఎండకు ప్రజల అతలాకుతలం

- పలు జాగ్రత్తలు అవసరమంటున్న నిపుణులు
- జిల్లాలో 40 కి చేరిన ఉష్ణోగ్రత..!

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



రెండు మూడు రోజుల నుంచి ఎండ వేడిమి కి జిల్లా నిప్పుల కొలిమిగా మారింది. ఎండాకాలం పూర్తిస్థాయిలో జొరబడక ముందే సూర్యుడు భగ భగ మండుతూ ఇప్పటికే జిల్లాలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరింది. దీంతో ప్రజలు అతలాకుతలమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు దంచి కొడుతు న్నాయి. జనం ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఉదయం 9 గంటల నుండి ఎండలు దంచి కొట్టడంతో ఇంటి నుండి వెళ్లాలంటే భయపడుతున్నారు. ఎండ తీవ్రతకు పిల్లలు వృద్ధులు బయ టికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరం తప్ప బయటకు వెళ్లాలంటే సాయంత్రం పూట వారి పనులను చేసుకుంటున్నారు. అదేవిధంగా మూగజీవాలు నీటి కోసం నీటి తొట్లు లేక అల్లాడుతున్నాయి. జిల్లాలో మూగజీవాల కోసం నీటితోట్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ఎండ తీవ్రతకు కొన్ని ప్రాంతాల్లో రోడ్లన్నీ నిర్మాణుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రతకు జిల్లాలోని కొన్ని పట్టణాల్లో షాపులు వెలవెలబోతున్నాయి. ఇది గాక ఇండ్లలో గాబుల్లో, డ్రమ్ములలో ఉన్న నీటి కూడా వేడెక్కిపోతున్నాయి. దీంతో మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏసీలు, కూలర్లు ఎండ తీవ్రతకు వేడిస్తుండడంతో జనం నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఉష్ణోగ్రత 40 కి చేరడంతో జనం ఇంటికే పరిమితమవుతున్నారు. ఉద్యోగులు 8 గంటలకే తమ కార్యాలయాలకు వెళుతున్నారు. అంతేకాదు రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు నీటి దాహార్తి కోసం అల్లాడుతున్నారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో పట్టణాల్లోకి వెళితే నీటి బాటిల్స్ లో నీటిని నింపుకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో వాహనదారులు, ప్రజలకు ప్రధాన కూడల్లో చలివేంద్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాల్లో గ్రామాలలో చలివేంద్రాలు స్వచ్ఛంద సంస్థల ద్వారానైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు, పాదాచారులు కోరుతున్నారు. ఎండ తీవ్రకు తట్టుకోలేక జనం టోపీలు, కళ్ళజోళ్ళు వాడే పరిస్థితి ఏర్పడింది. మహిళలైతే స్కార్పులు, హెల్మెట్లు ధరిస్తూ ఎండ నుండి రక్షణ పొందుతున్నారు. ఇది గాక ఎండ నుండి రక్షణ పొందేందుకు శీతల పానీయాలు,పండ్ల రసాలు,మజ్జిగ ఇతర పానీయాలు ఎక్కువ తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. చిన్నా మధ్యతరగతి కుటుంబాలు కూలర్లు ఉపయోగించడంతో వేడికి తట్టుకోలేక పోతున్నారు. ఏప్రిల్ మాసంలోనే ఎండ దంచి కొట్టడంతో మే నెలలో ఎండ తీవ్రత ఏ విధంగా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.





### దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి

## రాజీనామా చేయ్

- ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం..
- దొంగరాత్రి బిల్లుల కోసం కాంగ్రెస్ కండువా కప్పుకున్నది వాస్తవం కదా..
- కార్యకర్తల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీకి తాకట్టు పెట్టావ్..
- జగిత్యాల ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి

**వేద న్యూస్, జగిత్యాల బ్యూరో :**

జీవన్ రెడ్డి టీడీపీ నుంచి మంత్రి, ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. తాను చైర్మన్ పదవికి అధికార టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ప్రతిపక్ష బిజెపి పార్టీలో గౌరవప్రదంగా చేరానని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి అన్నారు. జగిత్యాల నియోజకవర్గం కార్యాలయం “కమల నిలయం”లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సంజయ్‌పై ధ్వజమెత్తారు. దొంగ రాత్రి పోయి కాంగ్రెస్ పార్టీలో చేరి..2018లో లక్ష ఓట్లు వచ్చాయి అన్ని గర్వంగా చెప్పుకున్నా సంజయ్, 2023 లో 40వేల ఓట్లు ఎందుకు తగ్గాయని అడిగారు. కోట్లు ఖర్చు పెడితే 8శాతం ఓట్ల తేడాతో గెలిచారన్నారు. మరి అప్పటికీ ఇప్పటికీ ఓట్ల శాతం ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. దొంగరాత్రి దొంగలెక్క పోయి బిల్లుల కోసం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నీతులు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. నిన్ను నమ్మిన వారి ఆత్మ గౌరవాన్ని పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీకి తాకట్టు పెట్టావ్ అంటూ మండిపడ్డారు. 2017లో భూమి పూజ చేసిన డబుల్ ఇల్లు ఎందుకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పూర్తికాలేదని ప్రశ్నించారు. ప్రజలు ఇటీవల జరిగిన సర్వేలో 108వ స్థానంలో ఉంచారని

మిగతా 4వ పేజీలో..

# పిఠాపురంలో కూటమి కుమ్ములాటలు

కాకినాడ : పిఠాపురం కూటమి పార్టీల్లో ఏం జరుగుతోంది? డిప్యూటీ సీఎం పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ నియోజకవర్గంలో టీడీపీ పట్టు తప్పుతోందా? అక్కడ సోలో పవర్‌గా ఎదగడానికి జనసేన స్కెచ్ గీస్తోందా? అంటే పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయి.. పవన్ కోసం టీడీపీ నేత వర్మ 2024 ఎన్నికల్లో తన సీటు త్యాగం చేసారు. ఆ సమయంలోనే ఎమ్మెల్సీ సీటు పైన హామీ దక్కింది. అయితే, పది నెలలు పూర్తయినా ఎమ్మెల్సీగా అవకాశం రాలేదు. ఇక జనసేన సభలో నాగబాబు చేసిన కామెంట్స్ వర్మ మద్దతు దారులు, టీడీపీ శ్రేణులకు ఆగ్రహం తెప్పించాయి..పిఠాపురంలో వర్మకు చెక్ పెడుతున్నారా? నాగబాబు ఎమ్మెల్సీ హోదాలో పిఠాపురంలో ఎంట్రీ ఇచ్చి హడావుడి చేస్తుండటంతో టీడీపీ కేడర్‌లో ఈ సందేహం మొదలైంది. నాగబాబు పిఠాపురంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అన్నా క్యాంటీన్ ను ప్రారంభించారు. పవన్ కోసం సీటు త్యాగం చేసిన వర్మకు ప్రాధాన్యత లేకుండా జనసేన నేతలు వ్యవహరిస్తున్న తీరు వర్మ టీడీపీ కేడర్ కు నచ్చటం లేదంట. దీంతో, పార్టీకి అనుకూలంగా కాకుండా జై వర్మ అంటూ స్లోగన్స్ ఇచ్చారు. నాగబాబు పర్యటన సమయంలో వర్మ మద్దతు దారుల నినాదాలకు కౌంటర్‌గా జనసేన కేడర్ జై జనసేన అంటూ నినాదాలు చేసారు. పిఠాపురం కేంద్రంగా రోజు రోజుకీ ముదురుతున్న ఈ వివాదం ఇప్పుడు రెండు పార్టీల శ్రేణులకు అంతు పట్టకుండా తయారైందంట.ఇటీవల పిఠాపురంలో జనసేన ప్లీనరీ వేదికగా నాగబాబు చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీ శ్రేణుల మధ్య గ్యాప్ మరింత పెరిగింది. వర్మకు ఎమ్మెల్సీ ఇవ్వకుండా పవన్ సోదరుడు నాగబాబుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వటం.. మంత్రిగానూ ఛాన్స్ ఇవ్వాలని నిర్ణయించటం టీడీపీ కేడర్ కు ఆగ్రహం తెప్పిస్తోంది. పిఠాపురంలో పవన్ గెలుపులో వర్మ కీలక పాత్ర పోషించారు.ఎన్నికల తరువాత క్రమేణా వర్మ ? జనసేన శ్రేణుల మధ్య గ్యాప్ పెరుగుతోంది. స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. జనసేన ప్లీనరీ వేదికగా నాగబాబు ఎవరైనా పవన్ విజయం వెనుక ఉన్నామని భ్రమ పడితే అది వారి ఖర్మ అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల పైన టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.ఇటీవల పిఠాపురం జనసేన నియోజకవర్గ ఇంఛార్జ్‌తో టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. వర్మకు ప్రాధాన్యత ఇవ్వకపోవటంపైన నిలదీసిన కార్యకర్తలు.. వర్మ చెబితేనే పవన్‌కు ఓటు వేసామని తేల్చి చెప్పారు. ఆ క్రమంలో వర్మ ను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలంటూ స్థానికులు కోరుతున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఎమ్మెల్సీ హోదాలో నాగబాబు రెండు రోజుల పాటు పిఠాపురంలో పర్యటనకు వచ్చారు. నియోజకవర్గం పెత్తనం తన సోదరుడు చేతిలో పెట్టేలా పవన్ డిసైడ్ అయినట్లు చెబుతున్నారు.ఇక నుంచి పిఠాపురం బాధ్యతలు నాగబాబు చూస్తారని జనసేన వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఆ సెగ్మెంట్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతన నిర్మాణాలను నాగబాబు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నారు. త్వరలోనే నాగబాబు మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. నాగబాబు ఎంట్రీతో నియోజకవర్గంలో రెండు పార్టీల కేడర్ మధ్య గ్యాప్ స్పష్టంగా కనిపించింది. జనసైనికులు పార్టీ నినాదాలతో హోరెత్తిస్తే, టీడీపీ శ్రేణులు వర్మ అనుకూల నినాదాలతో మోత మోగిస్తున్నాయి. ఆ క్రమంలో పిఠాపురం కేంద్రంగా వర్మ లక్ష్యంగా చోటు చేసుకునే రాజకీయంగా పై ఉత్కంఠ కొనసాగుతోంది.

**టీడీపీ నేతలపై కేసులు..** అలజడి జరిగింది నాగబాబు పర్యటనలోనే అయినా, టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది మాత్రం ఆయన కాదు. అయితే ఫిర్యాదు చేసిన జనసేన నేత పేరు కూడా నాగబాబే కావడంతో అత్యుత్సాహంతో కథనాలు వండి వారుస్తోంది. టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు అందింది వాస్తవమే, అయితే ఫిర్యాదు చేసింది ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కాదు, మొయిళ్ల నాగబాబు. ఆయన కూడా జనసేన నాయకుడే. ఆయన ఎవరిపై కేసు పెట్టారనేదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు టీడీపీ నేతలేనా, లేక పసుకు కండువాల ముసుగులో ఉన్న అల్లరి మూకలా..? పోలీస్ విచారణలో తేలాల్సి ఉందినాగబాబు పిఠాపురం పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన ప్రత్యేకంగా సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కి ధన్యవాదాలు చెబుతూ ఓ ప్రెస్ నోట్ విడుదల చేశారు. తన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు స్థానిక జనసేన నేతలకు కూడా థ్యాంక్స్ చెప్పారు. అయితే టీడీపీ నేతలు రచ్చ చేయడంపై ఆయన ఎక్కడా పెదవి విప్పలేదు. నాగబాబు పిఠాపురం పర్యటనలో తనను అడ్డుకుని మోటార్ సైకిల్ అద్దాలు పగలగొట్టారని జనసేన నేత మొయిళ్ల నాగబాబు పోలీసులకు ఫిర్యాదు చేయడం విశేషం. తన విధులకు ఆటంకం కలిగించారంటూ పిఠాపురం అడిషనల్ ఎస్సై జానీ భాషా కూడా మరో ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై గొల్లప్రోలు పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేయడం విశేషం.పిఠాపురం వ్యవహారం రెండు పార్టీల అధిష్టానాల వద్దకు వెళ్లింది. ప్రస్తుతానికి ఈ వ్యవహారంపై అధినేతలిద్దరూ సైలెంట్ గానే ఉన్నారు. నాగబాబు తొలి పర్యటనే ఇలా జరగడంతో అటు జనసేన నేతలు కూడా గుర్రుగా ఉన్నారు. పిఠాపురంలో జనసేనకు పక్కలో బల్లెంలా మారేందుకు టీడీపీ నేత వర్మ శక్తి వంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవి వచ్చి ఉంటే వర్మ సైలెంట్ గా ఉండేవారు. కానీ అటు సీటు త్యాగం చేసి, ఇటు పదవి రాకపోవడంతో ఆయన హర్ట్ అయ్యారు. దీంతో పిఠాపురం కాస్త హాట్ సీట్ గా మారింది. ప్రస్తుతానికి కేసుల వరకు వ్యవహారం వచ్చింది. ముందు ముందు ఇంకే జరుగుతుందో చూడాలి.

# రైజింగ్ స్టేట్ గా ఆంధ్ర

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల ప్రకారం దేశంలోనే అత్యుత్తమ ఆర్థిక వృద్ధిని కనబరిచింది. రాష్ట్రం సాధించిన 8.21 శాతం వృద్ధి రేటు దేశంలోని ప్రధాన రాష్ట్రాలలో రెండవ అత్యధికం. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ తాజాగా విడుదల చేసిన తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ జాబితాలో మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడు 9.69 శాతం వృద్ధి రేటుతో మొదటి స్థానంలో కొనసాగుతోంది. అయితే, ఆంధ్రప్రదేశ్ సాధించిన ఈ గణనీయమైన వృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సానుకూల సంకేతంగా నిలుస్తోంది. ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్ తన ఆర్థిక వృద్ధి పథంలో స్పష్టమైన మెరుగుదలను కనబరిచింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో (2023-24) నమోదైన 6.19 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.02 శాతం అధికంగా, అంటే 8.21 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకుంటున్నదనడానికి నిదర్శనం. ఇక ప్రస్తుత ధరల విభాగంలో రాష్ట్ర వృద్ధి రేటు మరింత ఎక్కువగా, 12.02 శాతంగా నమోదైంది. ఇది ద్రవ్యోల్బణం, ఇతర ఆర్థిక అంశాల ప్రభావాన్ని సూచిస్తుంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థిక వృద్ధి రేటులో దేశంలోనే రెండో స్థానానికి చేరుకోవడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తన అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. "ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్" అంటూ ఆయన తన ఆనందాన్ని ప్రజలతో పంచుకున్నారు. గతంలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక సవాళ్ల నుండి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్మాణాత్మక చర్యల ఫలితంగానే ఈ స్థాయి వృద్ధి సాధ్యమైందని ఆయన గట్టిగా విశ్వాసం వ్యక్తం చేశారుఈ అద్భుతమైన విజయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరి సమష్టి కృషి, విజయంగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలకు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం కోసం అందరూ కలిసి ఐక్యంగా ప్రయాణం కొనసాగిద్దామని ఆయన ఉద్బోధించారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన పాలనా విధానాలు ప్రజల నిరంతర సహకారం ఈ అసాధారణ ఫలితాన్ని అందించాయని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధిని సాధించి, రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన ఈ తాజా నివేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరైన మార్గంలో పయనిస్తోందని స్పష్టంగా తెలియజేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న అభివృద్ధి, సమర్థవంతమైన సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని ఈ వృద్ధి గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఈ వృద్ధి రేటు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి , ఉపాధి అవకాశాలను పెంచడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

# పవన్ అలా ముందుకు...



విజయవాడ : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు బాటలు మెరుగుపర్చుకుంటున్నారు. అన్ని సామాజికవర్గాలను కలుపుకుని వెళుతూ తన లక్ష్యాన్ని ఆయన నిర్దేశించుకున్నట్లే కనపడుతుంది. తనకు ఇంతటి విజయాన్ని అందించిన కాపు సామాజికవర్గంతో పాటు అభిమానుల ఆశలు నీరుగార్చకుండా కొంత ఆలస్యమయినా అనుకున్న టార్గెట్ ను రీచ్ అవ్వడానికి ఒక మార్గాన్ని రూపొందించుకుంటున్నారన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. ఇటు కాపు సామాజికవర్గం, అటు కమ్మ సామాజికవర్గంతో పాటు బీసీ ఓటర్లతో పాటు అన్ని వర్గాలను తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు పవన్ కల్యాణ్ చేస్తున్నట్లే కనిపిస్తుంది.ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నుంచి ఫుల్లు సపోర్టు పవన్ కల్యాణ్ కు ఉంది. మోదీ నుంచి కింది స్థాయి నేతల వరకూ పవన్ కల్యాణ్ ను అభిమానిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తక్కువ సార్లు ఢిల్లీకి వెళుతూ వారితో సత్సంబంధాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ ఫ్యూచర్ లో తనకు అండగా నిలబడేందుకు అన్ని రకాలుగా ఒక్కొక్క మెట్టును పేర్చుకుపోతున్నారు. బీజేపీ కూడా పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రిగా చూడాలని గట్టిగా అనుకుంటుందన్న వార్తలు వస్తున్నాయి. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాదు. ఇప్పుడు కాకుండా అవసరమైన సమయంలో పవన్ ను సీఎం పదవి ఎక్కించాలన్న ఉద్దేశ్యంతో కమలనాధులున్నారు.పవన్ కల్యాణ్ కూడా నిదానంగా మెట్లను పేర్చుకుపోతున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పుడు అందరి మనిషిలా కనిపిస్తున్నారు. ఇటు తెలుగుదేశం పార్టీ క్యాడర్ తో పాటు మిగిలిన సామాజికవర్గాలను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ ఫ్యూచర్ సీఎంగా అడుగులు వేస్తున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఒకవైపు హిందుత్వాన్ని భుజానకెత్తుకున్నారు. సనాతన ధర్మం పేరుతో పవన్ కల్యాణ్ అటు బీజేపీ మనసును దోచుకోవడమే కాకుండా ఇటు హిందుత్వ నినాదాన్ని అందుకుని తనకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకును ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నా ఆయన గోల్ మాత్రం ముఖ్యమంత్రి పదవి అనేలా వ్యవహార శైలి కనిపిస్తుంది. తాజాగా భద్రాచలం రామయ్య కల్యాణానికి హాజరు కావడం కూడా అందులో భాగమేనంటున్నారు.కమ్మ సామాజికవర్గం కూడా చంద్రబాబు, లోకేశ్ తర్వాత పవన్ కల్యాణ్ ను మాత్రమే ముఖ్యమంత్రిగా కోరుకుంటారు. జగన్ ను ఎట్టిపరిస్థితుల్లో వారు అంగీకరించే పరిస్థితి ఉండదు. ఆర్థికంగా, సామాజికపరంగా, ఎన్‌ఆర్ఐల నుంచి పారిశ్రామికవేత్తలు, సినీ పెద్దల వరకూ చంద్రబాబు, లోకేశ్ తర్వాత పవన్ కల్యాణ్ కు ముఖ్యమంత్రి పదవి రావాలని కోరుకుంటారు. ఇక ఇటు కాపు సామాజికవర్గం, అటు అభిమానుల బలమైన కోరిక పవన్ సీఎం కావడమే. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గిరిజనులు, దళితులు, బలహీనవర్గాల ప్రతినిధిగా పవన్ కల్యాణ్ తనను తాను మలచుకుంటూ పోతున్నారు. అయితే సుదీర్ఘ కాలం పాటు వేచి చూసైనా పవన్ కల్యాణ్ తన గోల్ ను చేరే అవకాశాలు మాత్రం లేకపోలేదు.

# గర్భం కాని గర్భం... 9 నెలల తర్వాత అసలు రహస్యం

రాజమండ్రి : అమ్మా.. అనే పిలుపు మహిళల జీవితంలో ఎంతో అమూల్యమైనది. అమ్మతనంతోనే తమ జీవితం పరిపూర్ణమవుతుందని ఎంతో మంది మహిళలు నమ్ముతారు. అయితే, ప్రస్తుతమున్న కాలంలో అమ్మతనం అనేది చాలా మంది మహిళలకు అంత సులువుగా దొరకట్లేదు. సంతానలేమి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పెళ్లైన ఎన్నో జంటలు సంతానం కోసం ఏళ్లపాటు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇదే పరిస్థితి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలానికి చెందిన ఓ మహిళకు ఎదురైంది. పెండ్లి జరిగి ఏళ్లు గడుస్తున్నా గర్భం దాల్చకపోవటంతో ఇరుగుపొరుగులు, ఇంట్లోవాళ్ల మాటలు భరించలేక ఆ మహిళ ఎవ్వరూ ఊహించని సాహసానికి ఒడిగట్టింది. దీంతో తొమ్మిది నెలలు మానసిక యాతన అనుభవించింది.దేవీపట్నం మండలంకు చెందిన జంటకు పెళ్లి జరిగి తొమ్మిదేళ్లు అయినా సంతానం కలగలేదు. దీంతో మహిళ సంతానలేమి కారణంగా సూటిపోటి మాటలు ఎదర్కోక తప్పలేదు. వారి మాటలను భరించలేక పోయిన మహిళ గర్భం దాల్చానంటూ అందరినీ నమ్మించింది. ప్రతినెలా భర్తతో కలిసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లేంది. భర్తను బయటే ఉంచి వైద్యురాలి వద్దకు వెళ్లేది. గర్భం దాల్చడానికి తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి మాట్లాడి వెళ్లిపోతుండేది. భర్తకు, అత్తింటిలోని వారికి మాత్రం వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పేది.నెలలు గడుస్తుండటంతో గర్భిణిలా కనిపించేందుకు చీర లోపల ఒత్తుగా దుస్తులు అమర్చుకునేది. తొమ్మిది నెలలు నిండడంతో ఈనెల 3న భర్త, అత్తతో కలిసి రాజమహేంద్రవరం ఆసుపత్రికి ప్రసవం కోసమని వెళ్లింది. అక్కడ ఏం చేయాలో ఆమెకు పాలుపోలేదు. దీంతో ఆ మహిళ మరో కొత్త ప్లాన్ వేసింది. ఆస్పత్రి వద్దకు వెళ్లాక వెంటనే వస్తానని చెప్పి భర్త, అత్తకు దూరంగా వెళ్లింది. ఎంతసేపటికి భార్య రాకపోవటంతో ఆస్పత్రి వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో భర్త, అతని తల్లి వెతికారు. ఆచూకీ దొరక్కపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించిగా మహిళ ఓ ఆటోలో వెళ్లినట్లు గుర్తించారు. చివరకు కాకినాడలో ఉన్నట్లు తెలుసుకొని భర్త, అత్త అక్కడి వెళ్లి ఆమెను ప్రశ్నించారు. అక్కడ ఆస్పత్రిలో ప్రసవానికి భయపడి వచ్చేశానని.. స్నేహితురాలి సూచనతో ప్రసూతి కోసం కాకినాడ జీజీహెచ్ లో చేరగా, కవలలు జన్మించారని చెప్పింది. కానీ, పుట్టిన వెంటనే ఆ పిల్లలను ఎవరో ఎత్తుకెళ్లారని చెప్పింది. దీంతో అనుమానం వచ్చి పోలీసులు లోతుగా విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది.పెండ్లి జరిగి తొమ్మిదేళ్లు అయినా సంతానం లేకపోవటంతో ఇరుగుపొరుగులు, ఇంట్లో వాళ్ల మాటలు భరించలేక గర్భం దాల్చానంటూ మహిళ అబద్ధం ఆడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అత్తింటివారికి, భర్తతోపాటు సదరు మహిళకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశారు. అయితే, గర్భందాల్చకపోయినా లోకం నిందలకు భయపడి గర్భందాల్చినట్లుగా అందరినీ నమ్మించేందుకు ఆ మహిళ తొమ్మిదినెలలు మానసిక యాతన అనుభవించింది.

# 15 తర్వాత అమరావతికి మోడీ...

అమరావతి : గత టీడీపీ ప్రభుత్వంలో ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ప్రధాని మోదీ.. పిడికెడు మట్టి, చెంబుడు నదీ జలాలను తీసుకొచ్చారు. నిధులిస్తారనుకుంటే, నీళ్లు, మట్టి మాత్రమే ఇచ్చారంటూ అప్పట్లో ఓ రేంజ్ లో సెటైర్లు పేలాయి. ఆ తర్వాత టీడీపీ, బీజేపీకి మధ్య వైరం మొదలు కావడంతో ఆ ప్రహసనాన్ని టీడీపీ నేతలే తీవ్రంగా తప్పుబట్టారు. మళ్లీ ఇప్పుడు అదే సీన్ రిపీట్ కాబోతోంది. ఈనెల 3వ వారంలో అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ రాబోతున్నారు. కనీసం ఈసారయినా ఆయన నిధులు తెస్తారా.. అమరావతికి, ఏపీకి ఏదైనా శుభవార్త చెబుతారా అనేది వేచి చూడాలి.ఈనెల మూడో వారం లేదా, నాలుగో వారంలో ప్రధాని మోదీ అమరావతికి వస్తారని తెలుస్తోంది. అధికారికంగా ఈ పర్యటన ఇంకా ఖరారు కాలేదు. అయితే ప్రధాని మోదీ రాక కోసం ప్రభుత్వం ఆఘ్రడీ ఏర్పాట్లు చేస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవాన్ని ఆయన చేతుల మీదుగా మొదలు పెట్టడానికి ఏపీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి లక్షమంది హాజరయ్యేలా, భారీ ఎత్తున ప్రణాళికలు రచిస్తున్నారు. వెలగపూడి సమీపంలో రాష్ట్ర సచివాలయం వెనక ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. 250 ఎకరాల్లో సభ ఏర్పాట్లు చేస్తున్నారు. సభాప్రాంగణానికి చేరుకోడానికి 8 మార్గాలను గుర్తించారు, ఆయా మార్గాలకు ఇన్ చార్జ్ లను నియమించి అన్నీ పక్కాగా జరిగేలా చూస్తున్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మూడు రాజధానుల కాన్సెప్ట్ పూర్తిగా పక్కనపడిపోయినట్టయింది. ఏపీకి ఏకైక రాజధాని అమరావతి అని తేలిపోయింది. వైసీపీ కూడా మూడు రాజధానుల నిర్ణయాన్ని అటకెక్కించేసిందని అర్థమవుతోంది. ఆ మధ్య శాసన మండలిలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా మూడు రాజధానుల విషయంలో తాము ఆలోచించుకోవాల్సి ఉందన్నారు. అమరావతిని కాదంటే ఫలితం ఎలా ఉంటుందో జగన్ కి తెలిసొచ్చిందని టీడీపీ నేతలు అంటున్నారు. ఒకరకంగా జగన్ కూడా తన మూడు రాజధానుల నిర్ణయాన్ని పక్కనపెట్టేసినట్టేనని తేలిపోయింది. ఈ దశలో అమరావతి నిర్మాణాన్ని తిరిగి భుజానికెత్తుకున్నారు సీఎం చంద్రబాబు. ప్రపంచంలోనే గొప్ప రాజధానిగా అమరావతికి గుర్తింపు తెస్తామంటున్నారు.2014లో తొలిసారి ప్రధాన మంత్రి అయిన తర్వాత ఏపీ రాజధాని అమరావతికి మోదీ శంకుస్థాపన చేశారు. ఉద్దండరాయునిపాలెంలో రాజధాని నగర నిర్మాణానికి 2015 అక్టోబరు 22న విజయదశమి నాడు ఈ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కొంతమేర పనులు జరిగినా అనుకున్న టైమ్ కి అవి పూర్తి కాలేదు.

2019లో ప్రభుత్వం మారడంతో అమరావతి నిర్మాణ పనులు ఆగిపోయాయి. జగన్ మూడు రాజధానుల వ్యూహం తెరపైకి తెచ్చారు. దీంతో అమరావతిని పక్కనపెట్టారు. ఇప్పుడు తిరిగి కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి పనుల్లో పురోగతి కనపడుతోంది. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి తిరిగి ప్రధాని మోదీనే ఆహ్వానించారు సీఎం చంద్రబాబు. మోదీతో కొత్త నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయిస్తారు.అమరావతి నిర్మాణానికి ఈసారి 15వేల కోట్ల రూపాయలు నిధులిస్తామని కేంద్రం చెప్పింది. ఇందులో కొంత అప్పు, మరికొంత గ్రాంట్ రూపంలో రానుంది. అయితే ఆ అప్పు కూడా తిరిగి చెల్లించే అవసరం లేకుండా కేంద్రం రుణమాఫీ చేస్తుందని రాష్ట్రం ఆశిస్తోంది. ఈ దశలో అమరావతికి వస్తున్న ప్రధాని మోదీ.. మరిన్ని నిధులకు హామీ ఇస్తారేమో చూడాలి. కేంద్రంలో బీజేపీకి పూర్తి స్థాయి మెజార్టీ లేని ఈ సమయంలో కూటమిలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న ఈ టైమ్ లో ఏపీకి కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా వరాలు ప్రకటిస్తుందనే అంచనాలున్నాయి.

# ఆక్వారంగం.... సాయం కోసం ఎదురు చూపులు

ఏలూరు : అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆక్వా రంగానికి అండగా ఏపీ సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. రైతుల పరిస్థితిని వివరిస్తూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు చంద్రబాబు లేఖ రాశారు. ట్రంప్ విధిస్తున్న అడ్డగోలు సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా ప్రయత్నాలు చేసి రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ను కోరారు ముఖ్యమంత్రి చంద్రబాబు.రాష్ట్ర జీడీపీలో ఆక్వా రంగం కీలకమైన భూమిక పోషిస్తోందని, సంక్షోభ సమయంలో ఆక్వా రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. భారత దేశం నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా 27శాతం దిగుమతి సుంకం విధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. వీటిలో రొయ్యలే 92శాతం వాటాను కలిగున్నాయి. అమెరికా దేశానికి రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారత దేశంపై 27శాతం దిగుమతి సుంకం కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలో ప్రస్తావించారు.ఇక ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై కేవలం 10శాతం సుంకమే విధించింది అమెరికా. ఇది మన దేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ వారికి అనుకూలంగా మారుతుందన్నారు. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77 శాతం కౌంటర్ రెయిలింగ్ డ్యూటీ భారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలను కలుపుకుంటే ఈక్వెడార్, భారత్ దేశానికి మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20శాతం ఉంటుంది.అమెరికా విధించిన కొత్త సుంకం ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వచ్చింది. దీని కారణంగా అమెరికా వెళ్లే అన్ని ఎగుమతులపైన ఈ భారం పడుతుందని అభిప్రాయపడ్డారు చంద్రబాబు. గతంలో వచ్చిన ఆర్డర్స్ కు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేయబడి కోల్డ్ స్టోరేజ్ పోట్లలో ఉన్నాయి. కొత్త నిబంధనల వల్ల ఈ ఉత్పత్తులపై సుంకాల భారం పడుతుంది.యూరోపియన్ యూనియన్ లో భారతీయ ఎగుమతిదారులు 50శాతం తనిఖీ రేట్లు, 4 నుంచి 7 శాతం దిగుమతి సుంకంతో సహా నాన్ టారిఫ్ అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. కానీ వియత్నం వంటి దేశాలు యూరోపియన్ యూనియన్ తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్ ను ఆక్రమిస్తున్నాయని తెలిపారు చంద్రబాబు.ఇక వియత్నాం, థాయిలాండ్, జపాన్ దేశాల మార్కెట్లు భారత్ నుంచి సీ ఫుడ్స్ కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. అయితే, ఇప్పుడు అంతిమ ఉత్పత్తులపై విధించిన అధిక ట్యాక్స్ ల కారణంగా ఆ దేశాలు కూడా మనకిచ్చిన ఆర్డర్స్ ను రద్దు చేసుకున్నాయి. ఏపీలో కోల్డ్ స్టోరేజ్ లు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంటను ఎక్కడ ఉంచాలో కూడా తెలియడం లేదని గందరగోళమైన పరిస్థితిలో రైతాంగం ఉందని తెలిపారు. మరోవైపు 27శాతం సుంకాల కారణంగా రైతుల నుంచి పంట సేకరించడాన్ని ఎగుమతిదారులు నిలిపేశారు. ఈ పరిణామాలు రాష్ట్ర ఆక్వా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయన్నారు చంద్రబాబు

# ప్రవీణ్ కేసు.. కొత్త మలుపులు..



రాజమండ్రి : పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం విషయంలో క్రమక్రమంగా మీడియా, సోషల్ మీడియా హడావిడి కాస్త తగ్గింది. ఆందోళనకారులు కూడా కాస్త చల్లబడ్డారు. అయితే అప్పటికే జరగాల్సిందందా జరిగిపోయింది. సోషల్ మీడియాలో ఎవరికివారు విశ్లేషకులైపోయారు. అది ప్రమాదం కాదు, హత్యేనంటూ తీర్మానించేశారు. ఆ హత్య ఎలా జరిగిందో కూడా వివరిస్తున్నట్టుగా మాట్లాడారు. ప్రవీణ్ పగడాల సీసీ టీవీ ఫుటేజీలు బయటకొచ్చేంత వరకు మీడియా, సోషల్ మీడియాలో అది ప్రమాదం కాదు, హత్యేనంటూ హోరెత్తిపోయింది. కానీ సీసీ టీవీ ఫుటేజీలు బయటపడిన తర్వాత ఈ కేసులో చిక్కుముడులు ఒక్కొక్కటే వీడుతున్నాయి. పోలీస్ విచారణపై తమకు నమ్మకం ఉందని ఎక్కువగా స్పందించవద్దని కుటుంబ సభ్యులే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వరుస కేసులు నమోదవడం విశేషంప్రవీణ్ పగడాల మరణం తర్వాత సోషల్ మీడియాలో హేట్ స్పీచ్ వైరల్ గా మారింది. కొంతమంది తీవ్రంగా స్పందించారు. మతాలను మధ్యలోకి తీసుకొచ్చారు. గతంలో వార్నింగ్ లు ఇచ్చినవారే ఇప్పుడు చంపేసి ఉంటారని అనుమానించారు. సీసీ టీవీ ఫుటేజీలు బయటకొచ్చిన తర్వాత

హర్షకుమార్ చేసిన వ్యాఖ్యల్ని పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అది హత్యే అయితే అందుకు మీ దగ్గరున్న ఆధారాలు చూపండి అంటూ నోటీసులిచ్చారు. హర్షకుమార్ కూడా తగ్గేది లేదన్నారు. అసలు అది హత్య కాదంటూ మీ దగ్గర ఉన్న ఆధారేంటో చూపెట్టాలన్నారు. తాను రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ద్వారా వివరాలు రాబడతానని చెబుతున్నారు.హర్షకుమార్ సంగతి పక్కనపెడితే.. క్రిస్టియన్ సామాజిక వర్గం నుంచి కూడా కొంతమంది పాస్టర్లు, ఇతర సంఘాల నేతలు ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన మృతి విషయంలో ఏపీ పోలీసులు నిజాలు దాచిపెడుతున్నారని కూడా ఆరోపించారు. సోషల్ మీడియాలో వీడియోలను పోస్ట్ చేశారు. ఈ ఆరోపణలన్నిటినీ పోలీసులు నిశితంగా గమనించారు. అసత్య ప్రచారం చేయొద్దని, మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దని గతంలోనే పోలీసులు విజ్ఞప్తి చేశారు. అయినా కూడా కొంతమంది మరింత దూకుడుగా వ్యవహరించారు. అప్పటికప్పుడు పోలీసులు సంయమనం పాటించారు. ప్రవీణ్ పగడాల మృతిపై ఆందోళనలు కాస్త సద్దుమణిగిన తర్వాత ఆరోపణలు చేసిన వారిపై దృష్టి పెట్టారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడిన వారిపై కూడా వారు ఫోకస్ పెంచారు. వారందరికీ ఇప్పుడు నోటీసులిస్తున్నారు. ఆయన మృతి విషయంలో ఏమైనా కొత్త విషయాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలంటున్నారు. అదే సమయంలో మరింత దూకుడుగా వ్యవహరించి, తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు కేసులు పెట్టారుప్రవీణ్ మరణంపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తూ, ప్రజల్ని రెచ్చగొడుతున్నారనే ఆరోపణలపై తాజాగా ఇద్దరిపై కేసులు పెట్టారు పోలీసులు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాకు చెందిన పాస్టర్ అజయ్ పై తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. వైసీపీ క్రైస్తవ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్

# కమలదళంలో కోల్డ్ వార్



హైదరాబాద్ : "రాజాసింగ్‌కు ఎవరూ సాటిలేరు.. ఆయన హిందూ ధర్మానికి ఆదర్శం. సర్వం హిందూ ధర్మం కావాలన్నదే రాజాసింగ్ లక్ష్యం". ఈ మాటలు అన్నది మరెవరో కాదు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. సడెన్‌గా బండి అంతలా రాజాసింగ్‌ను ఎందుకు పొగడాల్సి వచ్చింది? హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ముందు.. శ్రీరామనవమి శోభాయాత్రకు ముందు.. రాజాసింగ్‌ను బండి సంజయ్ ఎందుకు ఆకాశానికి ఎత్తారు? ఏదైనా వ్యూహం దాగుందా? మరెవరిపైనైనా మైండ్ గేమ్ ఆడారా? అనే చర్చ నడుస్తోంది. ఈమధ్య గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రెచ్చిపోతున్నారు. కిషన్‌రెడ్డి టార్గెట్‌గా తూటాల్లాంటి మాటలు వదులుతున్నారు. బీజేపీ పెద్ద లీడర్ ఓ మేకప్‌మేన్ అని.. అతని టేబుల్ సాఫ్ చేసే వాళ్లకే పదవులు ఇస్తున్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. గౌతమ్‌రావును ఎమ్మెల్సీ కేండిడేట్‌గా ఎంపిక చేయడంపై రాజాసింగ్ కస్సుమన్నారు. అన్నిపదవులు మీవాళ్లకేనా? బీజేపీలో సీనియర్లు, కార్యకర్తలు లేరా? అంటూ కిషన్‌రెడ్డిపై డైరెక్ట్ అటాక్ చేశారు. ఇక, స్టేట్ బీజేపీ అధ్యక్షుడి ఎంపికపైనా తరుచూ కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తుంటారు. ముఖ్యమంత్రులతో బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసే వారికి కాకుండా.. నిఖార్సైన కాషాయ లీడర్లకు, ప్రజల కోసం పోరాటం చేసే వారికే ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలంటూ రచ్చ రాజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తనపై పీడీ యాక్ట్ పెట్టి జైల్లో పెట్టడం వెనుకా.. తమ పార్టీ పెద్దలే ఉన్నారని కూడా కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ఇలా రెగ్యులర్‌గా కమలం పార్టీలో కలకలం రేపే రాజాసింగ్‌కు బండి సంజయ్ లాంటి బిగ్ లీడర్ సరిలేరు నీకెవ్వరూ అనే రేంజ్‌లో కితాబు ఇవ్వడం బీజేపీలో ఆసక్తిగా మారింది.

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పాతబస్తీలో వేలాదిమందితో భారీ శోభయాత్ర చేపట్టారు రాజాసింగ్. ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చినా ఇవ్వకున్నా.. శోభయాత్ర విషయంలో తగ్గేదేలే అని తేల్చి చెప్పారు. శాంతిభద్రతల సమస్యంటూ పోలీసులు టెన్షన్ పడుతున్నారు. పార్టీ తరఫున రాజాసింగ్‌కు ఎలాంటి సపోర్ట్ లేకున్నా.. ఆయన తన సొంత ఇమేజ్‌తో పాతబస్తీలో మజ్లిస్ పార్టీ ముందు తొడగొట్టాలని చూస్తున్నారు. జై శ్రీరాం.. జై బీజేపీ.. జై యోగి.. జై మోదీ నినాదంతో రాజాసింగ్ ఓల్డ్ సిటీ హీరోగా నిలుస్తున్నారు. ఆయనలోని కరుడుగట్టిన హిందుత్వ భావాజాలం వల్లే.. రాజాసింగ్‌ను పార్టీ అధిష్టానం సైతం ఏమీ అనలేక పోతోంది. లేదంటేనా.. కిషన్‌రెడ్డి ఎప్పుడో తొక్కేసేవారని పార్టీ వర్గాలే అంటున్నాయి. గతంలో ముస్లింలపై ఓ కాంట్రవర్సీ కామెంట్ చేయగా.. ఆయన్ను పార్టీ నుంచి కొన్ని నెలలు సస్పెండ్ చేశారు. ఎన్నికల ముందు మళ్లీ కాషాయ టికెట్ ఇచ్చి.. పాతబస్తీలో బీజేపీకి రాజాసింగ్ మినహా మరెవరూ దిక్కులేరని చెప్పకనే చెప్పారు. అలా సోలోగా ఎదిగి.. బండి సంజయ్‌తో సో బెటర్ లీడర్ అనిపించుకునే స్థాయికి చేరారు రాజాసింగ్. బండి సంజయ్ కావాలనే రాజాసింగ్‌ను ప్రమోట్ చేస్తున్నారా? అనే డౌట్ కూడా లేకపోలేదు.

తెలంగాణ బీజేపీలో తీవ్ర వర్గపోరు నడుస్తోందనేది ఓపెన్ సీక్రెట్. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు లాంటి వాళ్లు ఓ టీమ్ అంటారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, రాజాసింగ్ తదితరులు మరో వర్గంగా ముద్ర పడ్డారు. బండి సంజయ్ తరఫున రాజాసింగ్ గట్టిగా మాట్లాడుతుంటారు. అసలే ఫైర్ బ్రాండ్ లీడర్ కావడంతో ఆయన నోటికి కంట్రోల్ ఉండదు. కిషన్‌రెడ్డి మెతక లీడర్ అని.. ఆయన అధ్యక్షుడిగా ఉంటే తెలంగాణలో బీజేపీ బలపడే ఛాన్సే లేదని గతంలోనే రాజాసింగ్ రచ్చ చేశారు. తాజాగా, అధ్యక్ష మార్పు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రాజాసింగ్ మళ్లీ యాక్టివ్ అయ్యారు. బండి సంజయ్‌కు అనుకూలంగా స్టేట్‌మెంట్స్ పాస్ చేస్తున్నారు. అటు, కిషన్‌రెడ్డి మాత్రం ఈటల రాజేందర్‌కు కిరీటం కట్టబెట్టాలని గట్టిగా ట్రై చేస్తున్నారట. ఇలాంటి సందర్భంలో కిషన్‌రెడ్డిని రాజాసింగ్ కార్నర్ చేస్తుండటం.. రాజాసింగ్‌కు ఎవరూ సాటిలేరు అంటూ బండి సంజయ్ అతన్ని పొగుడుతుండటంతో.. కాషాయ దళంలో కలకలం నెలకొంది.

# అదిలాబాద్ ఎయిర్ పోర్టు అడుగులు

అదిలాబాద్ : విమానాశ్రయం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ వాసుల కలలు త్వరలోనే ఫలించబోతున్నాయి. ఆదిలాబాద్‌లోని రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో.. పౌరవిమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతో పాటు.. పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు ఆయన క్లారిటీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, పలు పార్టీల నాయకుల నుంచి కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 29 జనవరి, 2025 నాడు లేఖ రాశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. వ్యక్తిగతంగా కలిసి ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూములను ప్రజావసరాలకు సద్వినియోగం చేసేలా చొరవ తీసుకోవాలని కోరామని అన్నారు. దీనిపై వారు రక్షణ శాఖ అధికారులతో చర్చించిన తర్వాత సానుకూల నిర్ణయాన్ని తెలియజేస్తూ నిన్న లేఖ రాశారని చెప్పుకొచ్చారు. రాజ్‌నాథ్ సింగ్ సానుకూల స్పందనను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకుగానూ ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నామని చెప్పారు. 'పత్తి వ్యాపారానికి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు ఆదిలాబాద్ ప్రధానమైన కేంద్రంగా ఉంది. దీంతో ఆదిలాబాద్ తో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల నుంచి.. విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసే విషయంలో చొరవ తీసుకోవాలని దశాబ్దాలుగా డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై నేను 7 జూలై 2022, 15 ఫిబ్రవరి 2023నాడు నాటి ముఖ్యమంత్రికి లేఖలు రాశాం. ఐదేళ్లుగా ఈ విషయంపై పదే పదే నేను ప్రస్తావించాను. అయినా రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'అటు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే విమానయాన సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభిస్తామని 2021 అక్టోబర్ లో నాటి పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా నాటి సీఎంకి లేఖ రాశారు. కానీ దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కానీ ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. వారి నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని.. నేను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో, పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడుకి లేఖలు రాయడంతో పాటుగా వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేశాను' అని చెప్పారు.

వరంగల్ విమానాశ్రయానికి అనుమతులు లభించడంతో.. విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేసి ఇస్తే.. ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసేందుకు వీలవుతుంది. తద్వారా వీలైనంత త్వరగానే.. వరంగల్ ప్రజల స్వప్నం సాకారం కానుంది. గత నెలలో.. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటు, ఇందుకు సంబంధించిన పురోగతి తదితర విషయాలను నేను, రామ్మోహన్ నాయుడు సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించాం' అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. రీజనల్ కనెక్టివిటీ స్కీమ్‌– ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ పథకంలో భాగంగా.. దాదాపు 620 రూట్లలో ఇప్పటికే హైదరాబాద్‌కు 60 రూట్స్ (10%) ఆపరేషన్‌లో ఉన్నాయి. వరంగల్, ఆదిలాబాద్‌లో కూడా విమానాశ్రయాల సేవలు ప్రారంభిస్తే తెలంగాణకు ఉడాన్ కింద మరికొన్ని రూట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రజల ప్రయాణంతో పాటుగా.. ఈ ప్రాంతంలో వాణిజ్యాభివృద్ధికి కూడా తోడ్పడనుంది' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లో గతంలోనే విమానాశ్రయం ఉండేది. దీన్ని సైనిక అవసరాల కోసం మాత్రమే వినియోగించేవారు. కాలక్రమేణా.. వివిధ కారణాలతో రక్షణ శాఖ కార్యకలాపాలు కూడా ఆగిపోయాయి. ఇప్పుడు ఈ విమానాశ్రయాన్ని తిరిగి యాక్టివేట్ చేయడం రక్షణశాఖకు, పౌర సేవలకు ఎంతో ఉపయోగపడనుంది. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి పట్ల నరేంద్రమోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం. విమానాశ్రయాల ఏర్పాటు వల్ల మన వ్యవసాయ ఉత్పత్తులు.. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునేందుకు మార్గం సుగమం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఆయా విమానాశ్రయాల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించడంతో పాటుగా సంపూర్ణ సహకారం అందిస్తే.. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు వీలైనంత త్వరగా ప్రజలకు సేవలందిస్తాయి' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# వేములవాడలో వింత ఆచారం

కరీంనగర్ : శ్రీరామనవమి సందర్భంగా అంతట సీతారాముల కల్యాణం జరిగితే వేములవాడలో వింత వివాహాలు జరిగాయి. రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణ శుభముహూర్తాన శివపార్వతులు జోగినిలు (ట్రాన్స్ జెండర్స్) శివుడిని పెళ్లి చేసుకున్నారు. ఓవైపు సీతారాముల కల్యాణం జరుగుతుంటే మరోవైపు స్త్రీ పురుష వయోభేదం లేకుండా వేలాదిగా తరలివచ్చిన శివపార్వతులు జోగినీలు, చేతిలో త్రిశూలం, నెత్తిన జిలకర బెల్లం పెట్టుకుని పెళ్లికూతురులా తయారై దేవుడిని పెళ్లి చేసుకున్నారు. త్రిశూలానికి భాషింగం కట్టి, మెడలో రుద్రాక్ష మాల, పసుపు కొమ్ము వేసుకొని ఒకరిపై మరొకరు అక్షంతలు చల్లుకుంటూ తలంబ్రాలు పోసుకుని దేవుడితో పెళ్లైనట్లు భావించారు. వేములవాడలో శ్రీరామనవమికి ఓ ప్రత్యేకత ఉంటుంది. రాజేరాజేశ్వరస్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణంతో పాటు శివపార్వతులు జోగినిలు, ట్రాన్స్ జెండర్స్ శివుడిని పెళ్లి చేసుకుంటారు. ఒకే వేదికపై రెండు వివాహ సన్నివేశాలు వేములవాడలో కనిపించడం ప్రత్యేకత. ప్రతి ఏటా శ్రీరామనవమికి కన్నుల పండువలా సీతారాముల కల్యాణంతోపాటు శివపార్వతులు శివుడిని పెళ్లి చేసుకోవడం వింత ఆచారం అనాదిగా కొనసాగుతుంది. వింత ఆచారాన్ని రూపుమాపేందుకు శివపార్వతుల కోసం ప్రత్యేకంగా మహాశివరాత్రి తర్వాత శివ కల్యాణం నిర్వహిస్తున్నప్పటికీ ధారణ చేసుకునే శివపార్వతులు మాత్రం శ్రీరామనవమికే వేములవాడకు వచ్చి దేవుడిని పెళ్లి చేసుకోవడం విశేషం. అనేక దశాబ్దాలుగా సాగుతున్న శివపార్వతుల పెళ్లి విశ్వాసంతో మొదలై, ఆచారంగా పరిణమించింది. జీవనశైలిగా ఇక్కడ దర్శనమిస్తోంది. అలవికాని పేదరికం, తీవ్రమైన అనారోగ్యం, ఎదుగు బొదుగులేని జీవితం, నిరాశావహమైన భవిష్యత్తు వారిని దేవుణ్ణి పెళ్లి చేసుకునేలా చేస్తున్నాయి. వేదికపై ఓవైపు దేవతామూర్తులకు కళ్యాణోత్సవం వైభవంగా సాగుతుంటే, ఆ సన్నిధిలోనే జోగినీలు శివుడిని తమ నాధునిగా భావించి ధారణ చేస్తారు. కేవలం ఈ వివాహం కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా చత్తీస్గడ్, మహారాష్ట్ర ల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తారు. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, నిజామాబాద్ ,జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, కొమరం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, జనగామ, వరంగల్, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుండి ఎక్కువగా, ఇతర జిల్లాల నుండి సంఖ్య కాస్త తక్కువగా శివపార్వతులుగా మారిన స్రీలు,పురుషులు, పిల్లలు వేములవాడలో జరిగే శ్రీరామ నవమికి తప్పక హాజరవుతారు. సీతారామ చంద్రులకు తలంబ్రాలు సమర్పించే వేళ వేములవాడ రాజన్న సన్నిధిలో శివపార్వతుల వివాహ ఘట్టం తలంబ్రాల వర్షం కురుస్తున్నట్టు మారిపోతుంది. శివపార్వతులు నవమి రోజున శివుడిని తమ భర్తగా భావించి వివాహాన్ని పునరుద్ధరించుకునేందు కోసమే ఇక్కడికి వేల సంఖ్యలో తరలివస్తారు. శివపార్వతులు వివాహ సమయంలో వారి చేతుల్లోని త్రిశూలం గంటలమోతలు, కల్యాణ వేదిక ప్రాంగణమంతా వర్షపు జల్లుగా కురిసే తలంబ్రాలు, శివసత్తుల పూనకాలు అద్భుత దృశ్యాలు కనిపిస్తాయి. రుద్రాక్షలు మంగళసూత్రాలుగా, కాళ్లకు రాగిమట్టెలు, చేతికి త్రిశూలం ఇచ్చి వీరశైవులు వీరి పెళ్లి తంతును పూర్తి చేస్తారు. రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సరే.. నవమి నాటికి జోగినిలు వేములవాడ చేరుకుంటారు. శివుడితో ధారణ పేరుతో తమ పెళ్లిళ్లు పునరుద్ధరించుకుంటారు. ఈ సంఖ్య లక్ష వరకు ఉండడం ఆశ్చర్యకరమైన విషయం. సీతారామ కల్యాణానికి ముందే శివపార్వతులు కొత్త దుస్తులు ధరించి, నుదుట పెద్ద బొట్టుతో, తలపై జీలకర్ర బెల్లం, చేతిలో త్రిశూలం, భుజానికి జోలె, అక్షింతలు పట్టుకొని శివుడితో వివాహానికి సిద్ధమవుతారు. ఇందులో వైవాహిక జీవితం గడుపుతున్న వారు కూడా ఉన్నారు. అనారోగ్య కారణాలు, జీవితంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇతరత్రా సమస్యలు తెలంగాణలో అనేక మందిని శివపార్వతులుగా మార్చడంలో దోహదపడుతున్నాయి. వేములవాడ దేవస్థానంలో శివపార్వతుల పెళ్లి తంతు వీరశైవులు నిర్వహిస్తారు. శివపార్వతులుగా మారేవారికి వీరశైవులు మెడలో రుద్రాక్షను మంగళసూత్రంగా వేస్తారు. కాళ్లకు రాగి మట్టెలు తొడిగి స్త్రీ, పురుష భేదం లేకుండా వారికి చీర కట్టిస్తారు. అనంతరం చేతికి త్రిశూలం ఇచ్చి శివుడితో పెళ్లి జరిపిస్తారు. దీంతో ఆయా స్త్రీ, పురుషులు శివపార్వతులుగా మారినట్టు భావిస్తారు. శివపార్వతులు కనీసం ఐదు ఇళ్లలో, శ్రావణమాసంలో కొన్ని వారాలపాటు భిక్షాటన చేస్తారు. శివుడిని పెళ్లి చేసుకున్న తరువాత శివుడి భార్యగానే కొనసాగుతున్న వారు ఉన్నారు. ఆర్థికంగా, సామాజికంగా మెరుగైన జీవనం గడుపుతున్న వారు, కుటుంబ జీవన వ్యవస్థలో కొనసాగుతున్న వారిలో కొందరు నవమి రోజు వేములవాడ వచ్చి ఈ ధారణ కార్యక్రమంలో పాల్గొంటారు. సీతారాముల కళ్యాణ శుభ ముహూర్తాన శివుడుని వివాహం చేసుకున్నట్లు భావించే శివపార్వతులు సాయంత్రం జరిగే శోభాయాత్ర లో హల్చల్ చేస్తారు. శివపార్వతులు జోగినిలు హిజ్రాలు డిజే సౌండ్స్ తో డప్పు నృత్యాలు చేస్తూ హంగామా సృష్టిస్తారు. రాత్రి పొద్దుపోయే వరకు ఆడి పాడిన శివపార్వతులు మరుసటి రోజు పోచమ్మకు బోనాల సమర్పించి విందు భోజనాలు ఆరగిస్తారు. శివుడిని వివాహం చేసుకున్న శివపార్వతులు రాజన్న సన్నిధిలో మొక్కులు చెల్లించి తిరుగు ప్రయాణం అవుతారు. మహిళలు, పురుషులే కాదు.. లోకజ్ఞానం తెలియని ఆడపిల్లను శివపార్వతులుగా మార్చే శివుడితో పెళ్లి తంతు ప్రక్రియ ధారణ పేరుతో వేములవాడ రాజన్న సన్నిధిలో ఏళ్ల తరబడి సాగిపోతూనే ఉంది. అటు ప్రభుత్వం, ఇటు పోలీసు యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు చిన్నారుల పెళ్ళికి అభ్యంతరాలు చెబుతున్నా, పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చిందే తప్ప.. ఆచారం మాత్రం యధావిధిగా కొనసాగుతూనే ఉంది. దైవభక్తితో సాగుతున్న వింత ఆచారం వికృత రూపం దాల్చకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కోట్ల ఆస్తిని వదిలేసి.. సన్యాసం

గాంధీనగర్ : గుజరాత్ లోని నగరానికి చెందిన జైన్ బ్లాక్‌కు చెందిన నరేంద్ర గాంధీ, సంగీత గాంధీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో, ఇప్పుడు 26 ఏళ్ల కుమార్తె నికితా విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకుంది. నరేంద్ర గాంధీ ఒక కోటీశ్వరుడు. గొప్ప ధనవంతుడు. అయితే, ఇప్పుడు బిలియనీర్ కుమార్తె నికితా సిరి తన సంపదను వదులుకుంది. నికిత గత ఏడు సంవత్సరాలుగా సన్యాసి కావాలని కోరుకుంది. ఆమె కోరిక ఇప్పుడు నెరవేరింది. నికిత సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకోవడంతో, ఆమె బంధువులు యాద్గిర్‌లో గొప్ప ఊరేగింపు నిర్వహించారు. వివిధ సంగీత వాయిద్యాలతో ఊరేగింపు జరిగింది, మొత్తం జైన సమాజం అందులో పాల్గొంది. నికితా ఇకపై ఎలాంటి వస్తువులను ఉపయోగించనందున ఊరేగింపు సమయంలో ప్రజలకు కొత్త దుస్తులతో సహా వివిధ వస్తువులను విరాళంగా ఇచ్చింది. ప్రమాణాలు అంగీకరించిన తర్వాత, అత్యంత కష్టతరమైన మార్గాన్ని తీసుకోవాలి. బూట్లు ధరించకూడదు, రవాణా కోసం ఎటువంటి వాహనాలను ఉపయోగించకూడదు. మీరు ఒకే చోట రెండు రోజుల కంటే ఎక్కువ ఉండకూడదుతెల్లని, శుభ్రమైన బట్టలు ధరించాలి. రోజువారీ నడక జీవితాన్ని గడపాలి. సన్యాసం స్వీకరించిన తలవెంట్రుకలను బ్లేడు ఉపయోగించకుండా చేతితోనే గుండు చేయించుకుంటారు. నికితా ఇంత కష్టతరమైన జీవితాన్ని ఎంచుకుంది. నాన్న ధనవంతుడు అయినప్పటికీ, అవన్నీ వదిలేసుకుంది. తన కుటుంబాన్ని, బంధువులను విడిచిపెట్టి సన్యాసిగా మారడం గురించి మాట్లాడిన నికిత, "గురుకులవాసికి వెళ్లడం నాకు సంతోషంగా ఉంది" అని అన్నారు. అన్నీ వదిలి వెళ్ళడం పట్ల నాకు ఎలాంటి బాధ లేదు అని, నేను చాలా సంతోషంగా ఉన్నాను" అని నికిత వెల్లడించింది. భగవంతుడు మహావీరుడు చెప్పినట్లుగా, నా ఆత్మ పరమాత్మగా మారాలని కోరుకుంటుంది, అందుకే నేను ఈ మార్గాన్ని ఎంచుకున్నాను. చాలా కాలంగా, నా తండ్రితో సహా మొత్తం కుటుంబం నాకు కారు, బైక్‌తో సహా నేను అడిగినవన్నీ ఇచ్చింది. కానీ, "నాకు ఇప్పుడు అందులో ఏవీ వద్దు" అని నికిత పేర్కొంది. ఏడు సంవత్సరాల క్రితం, నేను ఈ జీవితం వద్దు అని నిర్ణయించుకున్నాను. అందుకే, నేను సన్యాసి కావాలని నిర్ణయించుకున్నాను. కానీ, తల్లిదండ్రులు మొదట్లో ఒప్పుకోకపోయినా.. వారిని ఒప్పించి, 7 సంవత్సరాల తర్వాత, నేను పరమాత్మ మార్గంలో నడిచేందుకు సిద్ధం అయ్యానని చెప్పింది.

# అధికార దుర్వినియోగానికి కారణమైన వైయస్ జగన్, వెల్లంపల్లి శ్రీనివాస్ పై విచారణ చేయాలి

**శారదా పీఠంలో పనిచేసిన దేవాదాయ ఉద్యోగికి నోటీసులు**

**37.72 లక్షల చెల్లించాలని నోటీసు సారాంశం**

**కనకమహాలక్ష్మి దేవస్థానంలో పని చేస్తూ డిప్యుటేషన్ పై శారదా పీఠానికి వెళ్లిన ఉద్యోగి**

**గత వైసిపి ప్రభుత్వం హయాంలో దేవాదాయ శాఖపై శారదా పీఠాధిపతి స్వరూపానంద ఆధిపత్యం**

**మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణకు తెలుగు శక్తి డిమాండ్**

**విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఓఎస్డి కింజరపు ప్రభాకర్ కి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఫిర్యాదు**

విశాఖపట్నం : కనక మహాలక్ష్మి దేవస్థానంలో ఋగ్వేద పండితుడిగా పనిచేస్తూ ఐదు సంవత్సరాల పాటు శారదా పీఠానికి వెళ్లిన ఉద్యోగి వీ.ఎస్.హనుమాన్ శర్మకు షోకాజ్ నోటీస్ జారీ అయిందని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు. దీనిని బట్టి శారదాపీఠం ఏ విధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందో అవుతోందని ఆయన పేర్కొన్నారు. ఇది అంశంపై సమగ్రమైన విచారణ జరిపిం చాలని కోరుతూ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ ఓఎస్డి కింజరపు ప్రభాకర్‌కు ఉదయం ఫిర్యాదు పత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు శారదా పీఠం లో పనిచేసి.. దేవాదాయ శాఖ నుంచి తీసుకున్న జీతాన్ని తిరిగి చెల్లించాలని దేవాదాయ శాఖ ఆ నోటీసులో పేర్కొందన్నారు. 37 లక్షల 71 వేల 671 రూపాయలను సదరు ఉద్యోగి దేవాదాయ శాఖకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో లేని శారదా పీఠానికి హనుమాన్ శర్మ ను డిప్యూటేష న్ పై పంపించినప్పుడుఆ విషయం అప్పటి శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోకు తెలియదా అని రామ్ ప్రశ్నించారు. హనుమాన్‌శర్మ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఐదేళ్ల వరకు అంటే.. 29 మే 2019 నుంచి 13 జూలై 2024 వరకు శారదా పీఠంలో డిప్యూటేషన్ ప్రాతిపదికన పనిచేశార న్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే స్వరూపానంద సరస్వతి వైయస్ జగన్ కు అనధికార రాజ గురువుగా మారిపోయారన్నారు. ఈ క్రమంలోనే దేవాదాయ శాఖ కూడా స్వరూపానంద సరస్వతి చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందన్నారు. వ్యవస్థ పరాయి చేతిలోకి వెళుతుంటే అప్పటి దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కళ్ళు మూసుకున్నారా? అని ప్రశ్నించారు. స్వరూపనంద తన 'సామ్రాజ్యాన్ని' మరింతగా విస్తరించాలనే కాంక్షతో 15 ఎకరాల భూమిని భీమిలి ప్రాంతంలో చౌకగా దక్కించుకున్నారన్నారు. చివరకు కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూమిని వెనక్కి తీసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ను జైలులో అక్రమంగా నిర్బంధించారని..మరి ఇప్పుడు అధికార దుర్వినియోగానికి కారణమైన.. వెల్లంపల్లి శ్రీనివాస్ లేదా వైయస్ జగన్మోహన్ రెడ్డి జైలుకు వెళతారా అని ప్రశ్నించారు. ఈ విషయంలో కుటుంబ ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం కనకమహాలక్ష్మి దేవాలయం ఉద్యోగి ఉదంతంఒకటి మాత్రమే తీసుకుంటే దాదాపు 38 లక్షల రూపాయలు ప్రజా ధనం వృధా అయిందని.. ఈ విధంగా ఎన్ని వందల కోట్ల రూపాయలు వృధా అయిందో లెక్క తేలాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు వైసీపీ హయాం లో శారదా పీఠానికి ప్రత్యేకంగా ఒక పోలీస్ పికెట్ కూడా ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా బి.వి.రామ్ ప్రస్తావించారు.

# హెచ్‌సియు లో ఉన్న జీవరాసులను బ్రతికించడం ప్రభుత్వము యొక్క బాధ్యత

**- పట్టుదలకు పోకుండా హెచ్ సి యు భూములను ఐటి కంపెనీలకు ఇవ్వడాన్ని ఉప సంహరించుకోవాలి**

**- మేడ్చల్ నియోజకవర్గం బాజాపా నాయకులు గాలి సంపత్ యాదవ్**

మేడ్చల్ మల్కాజ్గిరి : హెచ్ సి యు లోఉన్న 400 ఎకరాలలో ఎన్నో వృక్షాలు పక్షులు జంతువులు ఎన్నో జీవరాసులను బ్రతికించడం ప్రభుత్వము యొక్క బాధ్యత అని మేడ్చల్ నియోజకవర్గం బాజాపా నాయకులు గాలి సంపత్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ మహానగరంలో మార్పు వచ్చి వేడి పెరుగుతుంది, భారతదేశంలోనే నివాసానికి అనుకూలమైనటువంటి వాతావరణ సమతుల్యం కలిగిన హైదరాబాద్ నగరాన్ని గత పాలకులు ఈనాటి పాలకులు విధ్వంసం చేస్తున్నారు ఇప్పటికే హైదరాబాద్ నగరం పెద్ద ముప్పును ఎదుర్కోబోతోందన్నారు. గ్రౌండ్ వాటర్ పాతాళంలోకి వెళ్లిపోయింది, వేలాది వాటర్ ట్యాంకులు హైదరాబాద్ నగరంలో తిరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే" పొల్యూషన్ కూడా చాలా పెరిగిపోయింది అన్నది వాస్తవం,ముఖ్యంగా హెచ్ సి యు లోఉన్న 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదా? అన్నది కాదు అసలు విషయం..ఆ చెట్లను నరికి వేస్తే పర్యావరణ విధ్వంసం జరుగుతుందే ఆందోళన కరమైనదన్నారు. విరివిగా చెట్లను పెంచాలని, అడవిని కాపాడుకోవాలన్నారు. అభివృద్ధి పేరుతో ఈ భూమినీకంపెనీలకు ఇస్తున్నాము అని చెప్పి అడవులను నరుక్కుంటూ పోతే పొల్యూషన్ బాగా పెరిగిపోతుందని సంపత్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కావున!! రాబోయే రోజుల్లో ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకొని ప్రజలు హైదరాబాద్ నగరంలో తిరిగే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. డెవలప్ మెంట్ పేరిట గ్రీనరీని తొలగించటం సరైన పద్ధతి కాదు! ఈ 400 ఎకరాలలో మూడు చెరువులు ఉన్నవని, ఈ ప్రాంతంలో వర్షపు నీరు ఇంకిపోయి గ్రౌండ్ వాటర్ పెరుగుతుంది ఇప్పటికే హైదరాబాద్ నగరంలో వేడి పెరిగిపోయి వడగాలులు వీస్తున్నాయి,ఒకవైపు వాటర్ బాడిని కాపాడడానికి హైడ్రా తీసుకొచ్చింది ప్రభుత్వము అదే వాటర్ బాడీ ఉన్నటువంటి ఈ 400 ఎకరాలను చదును చేసి ఐటి కంపెనీలకు ఇస్తామనటం కరెక్ట్ కాదన్నారు. కంపెనీలకు ఇస్తాము ఉద్యోగ కల్పన జరుగుతుందని చెప్పి కంచ గచ్చిబౌలి భూములను ఇస్తున్నటువంటి ఇదే ప్రభుత్వం భవిష్యత్తులో హుస్సేన్ సాగర్ ను కూడా ఐటి కంపెనీలకు ఇస్తామని చెప్పే అవకాశం లేకపోలేదు అభివృద్ధి పేరు చెప్పి పర్యావరణాన్ని ధ్వంసం చేయటం సరైనది కాదు! హైదరాబాద్ మహానగరం కాంక్రీట్ జంగల్ గా మారిపోతుంది, ఒకపక్క హరితహారం పేర కొన్ని వందల కోట్లు ఖర్చు పెడుతూ మరోపక్క ఉన్న గ్రీనర్ని తీసివేయటం సమంజసమా కాదా? అన్నది ప్రభుత్వము ఆలోచించాలి విద్యార్థులు తిరుగుబాటు చేయడం వలన ఈ విషయం బయటికి వచ్చింది వాళ్లతో పాటుగా ప్రతిపక్ష పార్టీలు కూడా.. మాట్లాడుతున్నాయి,పర్యావరణ విధ్వంసం జరిగితే నివాసానికి హైదరాబాద్ నగరం అనుకూలంగా ఉండదు,కాబట్టి! తెలంగాణ ప్రభుత్వం పట్టుదలకు పోకుండా వెంటనే ఈ భూములను ఐటి కంపెనీలకు ఇవ్వడాన్ని ఉప సంహరించుకోవాలిని మేడ్చల్ గాలి సంపత్ యాదవ్ డిమాండ్ చేసారు.

# ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవంలోపాల్గొన్న ఎమ్మెల్యే

**వేద న్యూస్, నెక్కొండ :**



నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామం లో మాదిగ కులస్తులు ఏర్పాటు చేసిన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట లో విగ్రహ దాత నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, పెండెం రామనంద్, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నెక్కొండ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మండల కాంగ్రెస్ నాయకులు కెవి సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, దీక్షకుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేర్గు కుమార స్వామి, పులి నవీన్, రాంబాబు, చీర కిరణ్, విగ్రహ ప్రతిష్ట సభ్యులు మనుబోతుల యకంబ్రం, మానుబోతుల రాజు, విజయ్, నరేష్, గూడెల్లి రాంబాబు, మైదం అశోక్, సౌరబ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బందికి శిక్షణా తరగతులు

## లైన్ క్లియరెన్స్-యాప్‌పై అవగాహనా సదస్సు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ సిబ్బంది విద్యుత్ ప్రమాదాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని లైన్‌లలో పనిచేస్తున్నపుడు అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని తమ ప్రాణాలను రక్షించుకోవాలని శిక్షణా తరగతుల సందర్భంగా మెట్ పల్లి డీఈ గంగారాం పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి నూతనంగా ఆవిష్కరించిన ఎల్.సీ-యాప్ (లైన్ క్లియరెన్స్-అప్లికేషన్)పై డివిజన్ స్థాయి అవగాహనా సదస్సు మెట్ పల్లి లో నిర్వహించి సిబ్బందికి ఎల్సీడీ ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ నిచ్చారు. గతంలో ఒక ఫీడర్‌పై పని చేయాలంటే సంబంధిత సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను ఫోన్‌లో సంప్రదించి క్షేత్ర స్థాయి సిబ్బంది లైన్ క్లియరెన్స్ తీసుకునేవారు. కొన్ని సందర్భాల్లో ఒక ఫీడర్ కు బదులు మరో ఫీడర్ బందు చేయడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరిగి సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వీటన్నిటినీ అధిగమించడానికి ఎల్సీ యాప్ ద్వారా సంబంధిత సిబ్బంది రిక్వెస్ట్ పెడితే ఆ ఫీడర్ పై చేయబోయే పని ఏమిటి, ఎంత సమయం




బందు చేయాలి, ఆ ప్రదేశం ఫోటో అప్ లోడ్ చేస్తే, ఆ ఫీడర్ మొదలయ్యే సబ్‌స్టేషన్ ఆపరేటర్ బ్రేకర్ ట్రిప్ చేసి, ఐసోలేటర్ తెరిచిన ఫోటో అప్ లోడ్ చేస్తే పనికి ఉపక్రమించాలి. మరియు ఆ ఫీడర్ కింద మరేదైనా ఫీడర్ అడ్డంగా వెళ్తే ఆ రెండవ ఫీడర్ ను కూడా బందు చేస్తారు. మరియు ఆ ఫీడర్ పోయే మార్గంలో లైన్ ల మధ్య సరియైన నిడివి లేని దుర్బలమైన స్థానాలు కూడా పరిగణలోకి తీసుకుంటారు. ముఖ్యంగా ఈ పని ఆ సెక్షన్ లో పని చేసే సిబ్బంది అందరూ భాగస్వాములై, జట్టు స్ఫూర్తితో బాధ్యతగా పని చేస్తారు. లైన్ క్లియరెన్స్ గంట కంటే ఎక్కువ సమయం కోరితే ఏఈ అనుమతి తీసుకోవాలి. ఈ యాప్ సమర్థ నిర్వహణకు అన్ని సబ్‌స్టేషన్లకు ఆండ్రాయిడ్ ఫోన్ లు సరఫరా చేస్తామని డీఈ గంగారాం తెలిపారు. ఇలా ప్రతీ విపత్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే లైన్ బందు చేయబడుతుంది. చీటికి మాటికి, ఎవరు పడితే వారు ఫీడర్ లు బందు చేయరాదు. తద్వారా విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయి. ఇక నుండి ఏ ఒక్కరి ప్రాణం పోకూడదని, అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే లైన్ ల నిర్వహణ పనులు చేయాలని, ప్రమాదాలను సున్నా స్థాయికి తీసుకు రావడమే విద్యుత్ సంస్థ లక్ష్యమని డీఈ గంగారాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ లు మనోహర్, హరీష్, అంజన్ రావ్, రఘుపతి, ఏఈ లు, సబ్ ఇంజనీర్లు, క్షేత్ర స్థాయి సిబ్బంది సుమారు 200 మంది పాల్గొన్నారు.

# వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య

**వేద న్యూస్, హన్మకొండ :**



వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ప్రజలకు సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేసవిలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతల వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ తరఫున జిల్లాలో 21వ తేదీన వైద్యాధికారులు, పల్లె దవాఖాన వైద్యులు, ఎంఎల్ హెచ్పీలతో జిల్లా స్థాయిలో సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. వైద్యాధికారులు పని చేస్తున్న చోట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వడదెబ్బకు గురికాకుండా నివారణ చర్యలు చేపట్టి తగిన చికిత్సకు సంబంధించిన విషయాలను కూడా వారికి అవగాహన కల్పించాల్సిందిగా సూచించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్నటువంటి ఆరోగ్య సిబ్బందితో పాటు లైన్ డిపార్ట్మెంట్స్ అయినటువంటి అంగన్వాడీ, సెర్ప్ ఐకేపీ వారితో కూడా సమావేశాన్ని నిర్వహించి, ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశాలలో ఓఆర్ఎస్ పాకెట్లు అందించే విధంగా చేయడంతోపాటు షెడ్ నెట్ ద్వారా నీడ సౌకర్యాన్ని కల్పించాలని కోరినట్లు తెలిపారు. గ్రామాలలో ఆశా కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లి 11:30 లోపు ఇంటికి వస్తే బాగుంటుందని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తల పైన తెల్లటి రుమాలు, లేకపోతే క్యాప్ లాంటివి ధరించాలని, వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. తాగునీరు అధికంగా తీసుకోవాలని కోరారు. వడదెబ్బ తగలకుండా ఆరోగ్యం పట్ల ఇటువంటి జాగ్రత్తలు పాటించాల్సిందిగా ప్రజలకి సూచించారు. ప్రతి ప్రాథమిక కేంద్రాల్లో ఇంతకు ముందు నుండి కూడా కూలర్స్ పనిచేసేలా చూస్తున్నామని, వడదెబ్బ గురైన వారు చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి వైద్య చికిత్స అందిచడంతో పాటు టెంపరేచర్ తగ్గేటట్లు కూలర్ ను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణించినట్లయితే తహసీల్దార్, ఎస్సై, డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ విచారించి నివేదిక ఇస్తారని అన్నారు. ఇచ్చిన నివేదిక ను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. వడదెబ్బకు గురైన వారికి తలనొప్పి, తీవ్రమైన జ్వరం, నాలుక ఎండిపోవటం, దాహం వేయడం, మగతా లేదా నిద్ర లాంటి స్థితి, వాంతులు, పూర్తి ఆపస్మారక స్థితిలో ఉండడంలాంటి లక్షణాలు ఉన్నవారిని వెంటనే చల్లని ప్రాంతానికి చేర్చాలని, చల్లని నీటిలో ముంచిన క్లాత్ లతో తూడవాలని సూచించారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా జిల్లాలో 3లక్షలకు పైగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వడదెబ్బ బారీన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ జి. వి. భానుప్రసాద్, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇక్తేదార్ అహ్మద్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సౌకర్యాలతో శ్రీ సాయిగణేష్ హాస్పిటల్ ప్రారంభం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



తల్లి,పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం తమ హాస్పిటల్ నందు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని శ్రీ సాయిగణేష్ హాస్పిటల్ నిర్వాహకులు రవి, రాము, సందీప్ చౌదరిలు అన్నారు. బుధవారం నాడు విద్యానగర్ నందు త్రివేణి కాలేజ్ పక్కన గల భవనం నందు శ్రీ సాయిగణేష్ హాస్పిటల్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ హాస్పిటల్ నందు వెంటిలేషన్ సౌకర్యం లభిస్తుందని, అత్యాధునిక సేవలు సాధారణ ధరకు లభిస్తాయని చెప్పారు. అప్పుడే పుట్టిన శిశువుకు సంబంధించిన అన్నిరకాల వైద్య సేవలు, స్త్రీల కు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు తమ ఆసుపత్రి నందు చికిత్స లభిస్తుందని అన్నారు. తమ హాస్పిటల్ నందు ఆదివారం నాడు న్యూరో పిజిషియన్, మంగళవారం నాడు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అందుబాటులో వుంటారని చెప్పారు. తల్లి పిల్లలకు సంబంధించిన వ్యాధుల చికిత్స కోసం హైదరాబాదు, ఖమ్మం వంటి దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా తమ హాస్పిటల్ నందు వైద్య సేవలు అందిస్తున్నామని, సూర్యాపేట జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్ లు డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ చంద్రలోకె, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శ్రీలత చౌదరి, పిఆర్ వొలు విజయ్, రమేష్, వెంకటేశ్వర్లు, రంజిత్, యామా ప్రభాకర్, ముషం హరి తదితరులు పాల్గొన్నారు.

## వరుసగా వ్యవసాయ మోటార్లు చోరీ..!

### దొంగలను పట్టుకోవాలని రైతుల విజ్ఞప్తి

**వేద న్యూస్, ధర్మసాగర్ :**



హన్మకొండ జిల్లా, ధర్మసాగర్ మండల పరిధిలో పెద్ద పెండ్యాల గ్రామంలో గత నెల రోజులుగా వ్యవసాయ బోరు, క్రేన్ మోటర్ల, కరెంటు వైర్ల.. వరుస దొంగతనాలతో రైతులు హడలెత్తిపోతున్నారు. పోలీసులు వెంటనే స్పందించి మోటారు దొంగలను పట్టుకొని వారిని కఠినంగా శిక్షించి, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ వరుస దొంగతనాలపై ఓ రైతు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన బాధిత రైతు గోదాల రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..వ్యవసాయ భూమిలో తన క్రేన్ తో బావి తవ్వకాలు చేసి సాయంత్రం వరకు పని ముగించి క్రేన్ ను ఆ పొలంలోనే వదిలి వెళ్ళాడు. ఉదయం వెళ్లి చూడగా తన క్రేన్ మోటారు కనిపించలేదు. దాంతో చుట్టుపక్కల రైతులను ఆరా తీశాడు.

చుట్టుపక్కల గ్రామాలలో సైతం ఇలాగే వ్యవసాయ బోరు మోటారు దొంగతనాలు జరిగాయని స్థానికులు తెలపడంతో ఈ నెల 1వ తేదీన ధర్మసాగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దొంగలను పట్టుకొని సుమారు రూ.10వేల విలువ కలిగిన తన క్రేన్ మోటారును ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా పెద్ద పెండ్యాల గ్రామ పెద్ద నరసింహ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మరికొన్ని గ్రామాల్లోనూ మోటారుల దొంగతనాలు జరుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. కావున పోలీసులు తక్షణమే మోటర్ దొంగలను పట్టుకొని రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.



## శ్రీధర్ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ అభియాన్

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

భీమేశ్వర గార్డెన్‌లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ అభియాన్ క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గరిపెల్లి ప్రభాకర్ హాజరై పార్టీ సిద్ధాంతాలు, పార్టీ ఆవిర్భావ ఆవశ్యకత, పార్టీ కార్యకర్తలు 45 సంవత్సరాల కాలంలో ఎదురుకున్న ఒడిదుడుకులు, మరియు పార్టీ అంచెలంచెలుగా ఎదిగిన విధానం, పార్టీ నిర్మాణం, వాజపేయి నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, చారిత్రాత్మక విజయాలను కార్యకర్తలతో పంచుకున్నారు. పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతు బీజేపీ పార్టీ దేశ రక్షణకై అవతరించిన ఏకైక భారత దేశ పార్టీ అని బీజేపీ ఫర్ వికసిత భారత్ అనీ కొనియడారు, మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం నిస్వార్థ సేవలు అందించే కార్యకర్తలు కలిగిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యకులు అన్నం నర్సయ్య కట్కం శ్రీను, వైభవ్ బాలరాజు, కోల కృష్ణస్వామి, పిన్నింటి హన్మండ్లు,గుడిసె మనోజ్, వాసం మల్లేశం, బిల్లా కృష్ణ, శంకర్, నామాల శేఖర్ సగ్గు రాహుల్,నాంపల్లి లక్ష్మణ్, పట్టణ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయ్

మొదటి పేజీ తరువాయి

గుర్తు చేశారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బిఆర్ఎస్..కాంగ్రెస్ ఏ పార్టీ నుండి టికెట్ తెచ్చుకుంటావో తెచ్చుకో నేను బిజెపి తరపున నిలుచుంటా పోటీ చేస్తా ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం రా అంటూ సవాలు విసిరారు. కాగా ఇటీవల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్థాయి గురించి మాట్లాడినందుకు గాను డాక్టర్ బోగ శ్రావణి ఎమ్మెల్యే మాటలకు చురకలు అంటించారు. జగిత్యాల ప్రజలు రాబోయే కాలంలో ఎమ్మెల్యే సంజయ్ కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న,మహిళ మోర్చా ప్రదాన కార్యదర్శి సాంబరి కళావతి,మహిళ మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, పట్టణ ఉపాధ్యక్షులు పవన్ సింగ్, సింగం పద్మ, కాశెట్టి తిరుపతి, గడ్డల లక్ష్మి, ఇట్యాల రాము, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ నాయకులకు సన్మానం

**వేద న్యూస్, కోరుట్లప్రతినిధి :**

మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్ లను మెట్లచిట్టాపూర్ విడిసి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మీరు న్యాయపరంగానే కాకుండా సామాజికంగా కూడా చేసిన సేవలు వృధా పోలేవని అన్నారు. ఈ కార్యక్రమం లో విడిసి అధ్యక్షులు దండిక శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అమ్మిగల్లా ఆంజనేయులు, కోశాధికారి సదిరెం పెద్ద గంగారాం, నాయకులు గడ్డం పెద్ద సాయిలు, ఎల్ల నరసయ్య, రాజారపు రాజన్న, తంగళ్ళపల్లి సాయిలు, చింతకుంట శంకర్, పులి సంజీవ్ పాల్గొన్నారు.



## ఘనంగా ఎల్లమ్మ సిద్ధోగ మహోత్సవం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్ధోగ మహోత్సవంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు మల్యాల రాజు గౌడ్ ఆహ్వానం మేరకు జక్కుల తిరుపతి హాజరయ్యారు. అమ్మవారిని దర్శనం చేసుకున్న అనంతరం గౌడ కులస్తులకు గ్రామస్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు దానే తిరుపతి, స్థానిక బూత్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, బీజేపీ నాయకులు గొల్లపల్లి వెంకటేష్, మల్లారం తిరుపతి, సందేసారి మల్లికార్జున్,నందగిరి రాహుల్ గౌడ్, జంగం వంశీ, లింగంపల్లి కిషోర్, నరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని బాలనగర్, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, మల్లారం గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరా సంస్థ వేములవాడ ఫ్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధ్యానం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ,జిల్లా అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు,స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.



## ఏసీపీకి ఇల్లందకుంట ఆలయ చైర్మన్ థాంక్స్

**వేద న్యూస్, కరీంనగర్:**

హుజురాబాద్ ఏసీపీ సిహెచ్ శ్రీనివాస్ జిని బుధవారం హుజూరాబాద్‌లోని ఆయన ఆఫీసులో అపరభద్రాద్రి ఇల్లందకుంట ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలె రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరామ నవమి సందర్భంగా దేవ స్థానంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకొని పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన శ్రీనివాస్ జీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీని శాలువాతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాటు కోసం అహర్నిశలు కష్టపడ్డ పోలీసులకు తమ పాలకవర్గం నుంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపానని, బ్రహ్మోత్సవాల విజయవంతం కావడానికి పోలీస్ శాఖ అందించిన సహకారం మరువలేనిదని రామారావు వెల్లడించారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట ఆలయ ధర్మకర్తలు గోడిషాల పరమేష్, గోలి కిరణ్, కాంగ్రెస్ నాయకులు ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

## అనుమానమే పెనుభూతమై..

మొదటి పేజీ తరువాయి

పరారయ్యాడు. తెల్లారేసరికి విగతజీవిగా మారిన కుమారిని కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. హత్య విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరి విచారణ చేపట్టారు. తల్లిని కోల్పోయిన చిన్నపిల్లలను చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. మృతురాలి తండ్రి గువ్వల శివయ్య ఫిర్యాదు మేరకు నిందితుడైన భర్త సైదులు పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అతని కోసం వెతకడం ప్రారంభించినట్లు రూరల్ సీఐ నాగ దుర్గ ప్రసాద్ పత్రిక ప్రకటనలో తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073